పన్నుపోటు

తెల్లాపూర్ పట్టణ వ్యూ



తెల్లాపూర్ మున్సిపాలిటీలో అమాంతం పెరిగిన ప్రాపర్టీ ట్యాక్స్

- ముఖ్యమంత్రికి లేఖలు.. పట్టించుకోని అధికారులు
- కౌన్సిల్ సమావేశంలో తీర్మానం
- పన్ను భారాన్ని భరించలేమంటున్న స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నగరశివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపాలిటీ రింగ్ రోడ్డుతో శరవేగంగా అభివృద్ధి చెందింది. ప్రశాంతమైన వాతావరణం ఉండటంతో ఈ ప్రాంతంలో విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలకు మంచి డిమాండ్ పెరిగింది. దీంతో నగరంలో ఉండే ఐటీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉన్నత అధికారులు సైతం ఈ ప్రాంతంలో ఇళ్లు కొనుగోలు చేశారు. పంచాయతీగా ఉన్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేది. తెల్లాపూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఇంటి పన్ను పెంచడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన ఇంటి పన్నును తగ్గించాలని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. పన్నుల విషయంలో వారు ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

- తెల్లాపూర్ పంచాయతీ ఉన్న సమయంలో భూమి, నిర్మాణ విలువను బట్టి ఆ మొత్తాన్ని లెక్కించి దాని నుంచి 0.02 శాతాన్ని ఇంటి పన్నుగా నిర్ణయించేవారు. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారడంతో ఇంటి పన్నులు పెరిగాయి. మున్సిపాలిటీ పరిధిలో 0.54 శాతం ఇంటి పన్నుగా నిర్ణయించారు.
- పంచాయతీగా ఉన్న సమయంలో ఒక విల్లాకు రూ.12,694 పన్ను ఉండగా.. మున్సిపాలిటీ అయ్యాక రూ.32,656 అయ్యింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ వీకర్ సెక్షన్ కాలనీలో 40 గజాల రేకుల ఇల్లుకు పంచాయతీగా ఉన్నప్పుడు రూ.వెయ్యి వసూలు చేయగా, ప్రస్తుతం రూ.2 వేలు వసూలు చేస్తున్నారు.

మున్సిపాలిటీగా మారిన వెంటనే..

- గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీ అయిన తర్వాత మూడేళ్ల లోపు ఇంటి పన్ను ఎప్పుడైనా పెంచవచ్చు అనే నిబంధనలు ఉన్నాయి. కానీ తెల్లాపూర్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన వెంటనే ఇంటి పన్నులు పెంచారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం ఆ సమయంలో ఇంటి పన్నును పెంచలేదని సమాధానం ఇస్తున్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఇంటి పన్ను వేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో ఇంటి పన్ను మరింత పెరిగింది.
- పక్క మున్సిపాలిటీలతో పోల్చుకుంటే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎక్కువగా ఉండటంతో ఇక్కడి ఇంటి పన్ను పెరగడానికి ఒక కారణమని చెప్పవచ్చు. అయితే స్థానికులు మాత్రం రిజిస్ట్రేషన్ ఫీజు ఆధారంగా ఇంటి పన్నులు వేయవద్దని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులకు ఇంటి పన్ను సెగ

- స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్కడకు వెళ్లినా ఇంటి పన్ను విషయంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ఇంటి పన్నును తగ్గించాలని వారిని డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈ విషయంపై మున్సిపల్ చైర్ పర్సన్ లలితాసోమిరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ ప్రత్యేక సర్వసభ సమావేశం నిర్వహించారు. 0.18 శాతం ఇంటి పన్నును తగ్గించాలని తీర్మానం చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు.
- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నును తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 4,500 లేఖలు రాశారు.

అసెస్‌మెంట్ ఫీజులు వసూలు చేయొద్దు



ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ కోసం 0.5 శాతం ఫీజు కడుతున్నారు. ఇప్పటికీ కొన్నిచోట్ల మున్సిపల్ సిబ్బంది అసెస్‌మెంట్ ఫీజులు వసూలు చేస్తున్నారు. అది సరైనది కాదు. పెరిగిన ఇంటి పన్నును వెంటనే తగ్గించాలి.
– ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

నిబంధనల మేరకు నడుచుకుంటున్నాం



నిబంధనల ప్రకారమే ఇంటి పన్ను వసూలు చేస్తున్నాం. ఇంటి పన్ను తగ్గింపు విషయంలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే వాటిని సంబంధిత ఉన్నత అధికారులకు నివేదిస్తాం.
– శ్రీనివాస్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి, చందానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డుకు ఇరువైపులా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లాండ్‌మార్క్ రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభేరి ఎన్‌క్లేవ్, ఓల్డ్ గచ్చిబౌలి ప్రాంతాలలో విద్యుత్ ఉండదని చెప్పారు.

ఓల్డ్ గచ్చిబౌలి ఫీడర్ పరిధిలో..

ఓల్డ్ గచ్చిబౌలి విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1,2,3 ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

నల్లగండ్ల మార్కెట్ ఫీడర్ పరిధిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా నల్లగండ వెజిటెబుల్ మార్కెట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సురేందర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని తారానగర్ మార్కెట్, ఎస్ఎం లేఅవుట్, పోచమ్మ టెంపుల్ ఏరియా, మటన్ మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో....

ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఇంజనీర్స్ ఎన్‌క్లేవ్, గంగారం విలేజ్, హుడా కేబుల్ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీసీరోడ్డు పనులు షురూ



రాయదుర్గం: అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే ప్రక్రియలో భాగంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్‌లో రూ.19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు ఏర్పాట్లు చేస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ ఆధ్వర్యంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో ప్రస్తుత అంతర్గత రోడ్డును చదును చేశారు. స్థానికులు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా రాత్రి వేళల్లో సీసీరోడ్డు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కిటకిటలాడిన గణేష్‌గడ్డ

పటాన్‌చెరు టౌన్: అంగారక చతుర్థి పురస్కరించుకొని రుద్రారం గ్రామ సమీపంలో గణేష్‌గడ్డ దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ఉదయం గణనాథుడికి తేనెతో ప్రత్యేక అభిషేకం చేసినట్లు ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్ ,సతీష్ ,అయ్యప్పలు తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన

పటాన్‌చెరు టౌన్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పటాన్‌చెరు భవిష్యనిధి కార్యాలయం ముందు ఎన్ఏసీ (నేషనల్ అజిటేషన్ కమిటీ) ఆధ్వర్యంలో పెన్షనర్లు ఆందోళన నిర్వహించారు. పీఎఫ్ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీనియర్ సిటిజన్ల ప్రయోజనాలను కాపాడవలసిన అవసరం ఉందన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రయాణికులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ 1వ ప్లాట్‌ఫారంలో ఓ వ్యక్తి (45) బెంచీపై కూర్చొని అలాగే మృతి చెందాడు. భిక్షాటన చేసే వ్యక్తిగా భావిస్తున్నారు. అదే విధంగా 1వ నంబర్ ప్లాట్ ఫారం రైలు పట్టాలపై పడి గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందాడు. ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా, రైలు నుంచి కిందపడ్డాడా అని విషయం తెలియాల్సి ఉంది.

అన్ని విధాలుగా మొండికుంట అభివృద్ధి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



మొండి కుంటను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: మాదాపూర్ డివిజన్‌లోని ఖానామెట్‌లో విస్తరించి ఉన్న మొండి కుంటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం మొండి కుంట అభివృద్ధి పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి కుంట అభివృద్ధి కోసం కోటి రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నామని చెప్పారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలన్నారు కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ నాగరాజు, ఆర్‌ఐ శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి గొడుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడ జడ్పీహెచ్ఎస్‌లో టీఎస్‌యూటీఎఫ్ 5వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల 13,14వ తేదీలలో ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడలోని ఎన్ఆర్ సార్థా కన్వెన్షన్‌లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవ సభలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి కె.కె శైలజ, విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ శేరిలింగంపల్లి మండల అధ్యక్షులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సింహులు, ఉపాధ్యాయులు సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడ జడ్పీహెచ్ఎస్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించిన సభ్యులు

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్ రెడ్డి

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం గీతా భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ. 8 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో జూనియర్ కళాశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు. సుమారు 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాల ప్రస్తుతం వెయ్యి మంది విద్యార్థులు ఉండడం ఆనందంగా ఉందన్నారు. మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, గ్రంథాలయాల డైరెక్టర్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బూరుగడ్డ నగేష్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, వెన్నవరం మోహన్ రెడ్డి, పరమేష్ యాదవ్, విజయ్ కుమార్, విఠల్, యాదయ్య, పారిశ్రామికవేత్త వివిఎస్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..

మియాపూర్ : ప్రధాన రహదారుల్లో మ్యాన్‌హోల్‌లు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు రోడ్డులోని మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోయాయి. నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో వాహనాల రాకపోకలకు మూణ్నాళ్లకే పగిలిపోతున్నాయి. ఈ ప్రదేశాల్లో రాళ్లు, బండరాళ్లు ఏర్పాటు చేసి సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



మియాపూర్ క్యాంపు కార్యాలయం ఎదుట మ్యాన్‌హోల్ మూత పగిలిన దృశ్యం

ఆల్విన్‌కాలనీలో ముగ్గుల పోటీలు



హఫీజ్‌పేట్ : సంక్రాంతి పండగను పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి మాట్లాడుతూ పట్టణీకరణ నేపథ్యంలో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరిగిన తరువాత ఇళ్ల ముందు ముగ్గులు వేయడం తగ్గిపోయిందన్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని 35 కాలనీలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. వరలక్ష్మి, శ్రీదేవి, అంజలి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి సీసీ రోడ్లను పూర్తి చేయాలి

బంజారానగర్ వాసుల వినతి



ఎమ్మెల్యే గాంధీని కలిసిన కాలనీవాసులు

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని బంజారానగర్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లను పూర్తి చేయాలని స్థానికులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి అసంపూర్తి రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బంజారానగర్ వాసులు రవి శంకర్ నాయక్, సుదర్శన్, చిట్టి బాబు, పరుశురామ్, రాజు,నర్సింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై విద్యార్థులకు అవగాహన



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పొదుపుపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రశాంత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీరో అకౌంట్ బ్యాంకులో తీసుకోవడం, బ్యాంకు లావాదేవీలు, పొదుపు తదితర అంశాలపై పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, రమణ కుమారి, ఉదయకుమారి పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఒగ్గు ప్రవీణ్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు రాజనాల శ్రీదేవి కుమార్తె నందిత లక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు.




టెక్స్‌టైల్స్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం





మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న స్టాల్స్

మాదాపూర్: మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో మంగళవారం క్రాఫ్ట్స్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్స్, క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్‌ను సీసీటీ సెక్రటరీ హేమలత వీవర్స్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాన్ ఇండియన్ శ్రేణితో ,భారతీయ కళ ఒకేచోట కొలువుదీరిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో టెక్స్‌టైల్, రంగురంగుల డిజైనర్ సూట్‌లు, తన్సూర్ చేత వైబ్రెంట్‌వేర్, , క్లాసీ టామిక్స్, బనారసీ, హబోచ్ డిజైన్, చందేరీ చీరలు, కుర్తాలు, గద్వాల్, ఇక్కత్ చీరలు, ఆభరణాలు, వివిధ రకాల పెయింటింగ్‌లు అందుబాటులో ఉన్నాయని, రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీటీ మెంబర్ విజయలక్ష్మి, ప్రముఖ వీవర్స్ పాల్గొన్నారు.



నేటి నుంచి మాస్టర్స్ అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ

మియాపూర్: మెదక్‌లోని ఇందిరానగర్ స్టేడియంలో ఈ నెల 21, 22వ తేదీలలో నిర్వహించే 8వ రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్లు అధిక సంఖ్యలో పతకాలు సాధించడం ఖాయమని రంగారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చందానగర్‌లో రంగారెడ్డి జిల్లా మాస్టర్ అసోసియేషన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కొండా విజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మాస్టర్లకు 11వ తేదీ నుండి చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్, ట్రెజరర్ ధర్మపురి స్వాతి, అసోసియేషన్ సభ్యురాలు జ్యోతిగౌడ్, స్వప్నకపూర్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండా విజయ్‌కుమార్

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను వేరు చేయకపోతే వ్యాధులు వస్తాయన్నారు. పొడి చెత్త వల్ల ఆదాయం సంపాదించవచ్చని, తడి చెత్తతో ఎరువులు తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఆ ఎరువును మున్సిపాలిటీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన...

తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి అధ్యక్షతన కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న ప్రమాదాలపై గత నెల 29వ తేదీన 'అమ్మో.. ఆ రోడ్లు'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అలియన్స్ చౌరస్తాలో ఓ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ సంస్థ సహకారంతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. రోడ్లపై ప్రమాదాలు జరగకుండా భారీ కార్న్స్ ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ సాయిబాబా గుడి సమీపంలోని ప్రధాన రహదారిని పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హాస్టల్ నిర్వాహకులకు అవగాహన

మాదాపూర్: సంక్రాంతి సెలవులలో హాస్టళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, దొంగల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మాదాపూర్ పోలీసులు సూచించారు. మాదాపూర్‌లోని పూర్ణ కన్వెన్షన్‌లో మంగళవారం హాస్టళ్ల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి వివరించారు. దాదాపు 100 హాస్టళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.